



గజ్వేల్‌లో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో టీఎస్‌డీడీసీఎఫ్‌ఎల్ చైర్మన్ సోమాభరత్, జడ్పీ మాజీ చైర్మన్ లక్ష్మీకాంతారావు, ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి



కామారెడ్డిలో నామినేషన్ దాఖలు చేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో టీఎస్‌డీడీసీఎఫ్ఎల్ చైర్మన్ సోమాభరత్, విప్ గంప గోవర్ధన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి



హైదరాబాద్‌లో గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన చిత్ర పరిశ్రమకు చెందిన గౌతంరాజు, గురురాజు. చిత్రంలో బీఆర్ఎస్ నేత రామకృష్ణగౌడ్ తదితరులు

## గజ్వేల్, కామారెడ్డిలో కేసీఆర్ నామినేషన్

- గజ్వేల్‌లో పార్టీ శ్రేణుల ఘన స్వాగతం
- భారీ బైక్ ర్యాలీ.. కిక్కిరిసిన పట్టణం
- మధ్యాహ్నం కామారెడ్డిలో నామినేషన్
- అనంతరం ప్రజా ఆశీర్వాద సభ

సిద్దిపేట, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గాల నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రం నుంచి సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో గురువారం ఉదయం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఐవోసీ కార్యాలయం వెనుక ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద 11 గంటలకు చేరుకున్నారు. ఆయనకు స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక వాహనంలో ఆర్వో కార్యాలయానికి చేరుకొనే క్రమంలో బీఆర్ఎస్ నాయకులు గులాబీపూలు చల్లి అభిమానాన్ని చాటుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి బన్సీలాల్‌కు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సీఎం కేసీఆర్ అందజేశారు. అనంతరం హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న సీఎం కేసీఆర్‌కు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పుష్ప గుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. గజ్వేల్‌కు బీఆర్ఎస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ చేరుకోవడంతో పట్టణం గులాబీమయంగా మారింది. కార్యకర్తలు జై కేసీఆర్, జైజై కేసీఆర్, హ్యాట్రిక్ సీఎం కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. తిరిగి 11.46 గంటలకు కామారెడ్డికి హెలికాప్టర్‌లో సీఎం కేసీఆర్ బయలుదేరి వెళ్లారు. సీఎం వెంట ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, భరత్‌కుమార్ తదితర నేతలు రాగా ఆయన కామారెడ్డిలో నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ అనంతరం కామారెడ్డి డిగ్రీ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభను నిర్వహించారు. సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి సీఎం కేసీఆర్ ప్రసంగించారు.

## కామారెడ్డి నియోజకవర్గాన్ని బంగారు తునక చేస్త

- నాతోపాటే ఐటీ, పరిశ్రమలు వస్తయ్
- కామారెడ్డితో పుట్టుక నుంచే బంధం
- మా అమ్మమ్మది పోసాన్‌పల్లి గ్రామం
- బాదల్‌సింగ్ మార్వాడీ ఇంట్లో ఉన్నం
- మండల బ్రిగేడియర్‌గా పనిచేశా
- కామారెడ్డిని అద్భుతంగా తీర్చిదిద్దుత
- గోవర్ధన్ భవిష్యత్తుకు నాదీ హామీ
- కామారెడ్డి ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): కామారెడ్డి గడ్డతో తనకు పుట్టుక నుంచే అనుబంధం ఉన్నదని సీఎం కేసీఆర్ తెలిపారు. గురువారం కామారెడ్డి ప్రజా ఆశీర్వాద సభలో కామారెడ్డితో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత కోనాపూర్ గ్రామాన్ని గతంలో పోసాన్‌పల్లి అని పిలిచేవాళ్లని, అది తన అమ్మమ్మ ఊరని చెప్పారు. కారుగొండలో తన మేనమామలు ఉండేవారని తెలిపారు. తన చిన్నతనంలో అమ్మ, అమ్మమ్మతో కలిసి కామారెడ్డికి వస్తే రైలుకట్ట పక్కనున్న బాదల్ సింగ్ మార్వాడీ ఇంట్లో ఉండేవాళ్లమని చెప్పారు. కారుగొండకు చెందిన నిమ్మల జివ్వారెడ్డి ఇంట్లో కూడా ఉండేవాళ్లమని వెల్లడించారు. అంతకు మించిన అనుబంధం తెలంగాణ ఉద్యమ సమయంలో ఉన్నదని గుర్తు చేసుకున్నారు. 'తెలంగాణ ఉద్యమంలో భాగంగా జలసాధన ఉద్యమాన్ని ప్రారంభించినం. నీళ్ల విషయంలో తెలంగాణ ఎంత దోపిడీకి గురైందో ప్రజలకు తెలియజేసేందుకు 45 రోజులపాటు జలసాధన ఉద్యమం చేసినం. దోపిడీని ప్రజలకు వివరంగా చెప్పేందుకు టీఆర్ఎస్ తరపున మండలానికి ఒక బ్రిగేడియర్‌ను నియమించినం. అందులో కామారెడ్డి మండల బ్రిగేడియర్‌గా నేనే పనిచేసిన' అని పేర్కొన్నారు. అనంతరం హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో సభ నిర్వహించామని, అక్కడికి వెళ్లేందుకు కామారెడ్డిలోని దేశాయి బీడీ ఫ్యాక్టరీ, మరో చోట 'ఒకరోజు గులాబీ కూలీ' పని చేశానని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన తొలినాళ్లలోనే కామారెడ్డికి చెందిన న్యాయవాదులు అందరికన్నా ఎక్కువ చైతన్యం చూపించారని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలంటూ తన బావ రామారావు, మిత్రుడు తిరుమల్‌రెడ్డి నాయకత్వంలో బార్ అసోసియేషన్ ఏకగ్రీవ తీర్మానం చేసిందని తెలిపారు. తద్వారా ఉద్యమానికి మద్దతిచ్చిన మొదటి బార్ అసోసియేషన్‌గా రికార్డు సృష్టించిందని చెప్పారు. ఆ తర్వాత కామారెడ్డిలో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిందని, ఉప్పెనలా తెలంగాణ అంతటా విస్తరించిందని వివరించారు.

### కామారెడ్డిని అద్భుతంగా తీర్చిదిద్దుత..

గత ఎన్నికల సమయంలో గంప గోవర్ధన్‌ను అభ్యర్థిగా నిలబెట్టి, తాను ప్రచారం చేస్తున్నప్పుడు కామారెడ్డిని జిల్లా చేస్తామని హామీ ఇచ్చానని, ఆ మేరకు కామారెడ్డిని జిల్లా చేశామని, మెడికల్ కాలేజీని కూడా మంజూరు చేశామని సీఎం తెలిపారు. ఈసారి గంప గోవర్ధన్‌తోపాటు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నాయకులు తనను కామారెడ్డి నుంచి పోటీ చేయాలని చాలాసార్లు అడిగారని చెప్పారు. దేవుని ఆశీస్సులతో వచ్చి పోటీ చేస్తున్నానని పేర్కొన్నారు. తాను గెలిస్తే ఊహించని స్థాయిలో అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. 'కేసీఆర్ వస్తే ఒక్కడే రాడు కదా! కేసీఆర్ వెంబడి చాలా వస్తాయి. మంచి విద్య అందేలా విద్యాసంస్థలు వస్తాయి. ఉద్యోగ ఉపాధి అవకాశాలకు పరిశ్రమలు వస్తాయి. కాళేశ్వరం పెండింగ్ పనులు పూర్తి చేసి రెండేండ్లలోనే కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు నీళ్లు తెప్పించి చూపిస్తా. ఇట్లా ఊహకు కూడా అందని అభివృద్ధి కార్యక్రమాలతో కామారెడ్డి పట్టణంతోపాటు పల్లెల రూపురేఖలు మారుతాయి. ఆ బాధ్యత నాది' అని స్పష్టం చేశారు.

### గంప గోవర్ధన్ భవిష్యత్తుకు నాదీ హామీ

కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ రాజకీయ భవిష్యత్తు బాధ్యత తనదేనని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. తనని కామారెడ్డిలో నిలబెట్టడానికి గంప గోవర్ధనే చొరవ తీసుకున్నాడని తెలిపారు. కామారెడ్డికి తప్పకుండా రావాలని, కామారెడ్డి మరింత అభివృద్ధి కావాలని పదవిని త్యాగం చేసి తనను నిలబెట్టారని ప్రశంసించారు. గోవర్ధన్‌ను మరింత ఎత్తు పెంచే బాధ్యత, బరువు తనపై పడ్డదని పేర్కొన్నారు. తప్పకుండా గోవర్ధన్ రాజకీయ భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుందని, ఆ బాధ్యత తనదేనని చెప్పారు. తెలంగాణకు పెట్టుబడులు బ్రహ్మాండంగా వస్తున్నాయని, కామారెడ్డికి కేసీఆర్‌తోపాటు పరిశ్రమలు, ఐటీ రంగం కూడా వస్తాయని హామీ ఇచ్చారు. కామారెడ్డి నియోజకవర్గాన్ని బంగారు తునకలా చేసి మీకు అప్పగిస్తానని చెప్పారు. అందరం కలిసి కామారెడ్డిని అభివృద్ధి చెసుకుందామని పిలుపునిచ్చారు.

# వస్తున్నా.. అభివృద్ధి తెస్తున్నా

**కేసీఆర్ ఒక్కడే రాడు.. ఆయన వెంట చాలా వస్తయ్.. ఇది నా మాట**

- లక్ష మంది కొత్త బీడీ కార్మికులకూ ఆసరా పెన్షన్ అందిస్తాం
- వచ్చిన తెలంగాణను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నరు.. జాగ్రత్త!
- రాజకీయ అస్థిరత కోసమే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనజూసిండ్రు
- 50 లక్షలతో పట్టుబడ్డోడు నాపై పోటీ అట.. మీరే నిర్ణయించండి
- కామారెడ్డి ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్




గజ్వేల్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, టీఎస్ ఫుడ్స్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ మాజీ మడుపు భూంరెడ్డి తదితరులు

హైదరాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అంటూ చావునోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించిన తనపై.. తెలంగాణను విచ్ఛిన్నం చేసేందుకు ఎమ్మెల్యేలను కొనడానికి వచ్చి రూ.50 లక్షలతో పట్టుబడ్డ వ్యక్తి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నాడని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. మరోవైపు మోటర్లకు మీటర్లు పెట్టనందుకు తెలంగాణపై పగబట్టిన బీజేపీ కూడా బరిలో ఉన్నదని చెప్పారు. ఎవరికి ఏం బుద్ధి చెప్పాలో ప్రజలే నిర్ణయించుకోవాలని సూచించారు. గురువారం కామారెడ్డిలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడుస్తున్నా రాజకీయాల్లో, ప్రజాస్వామ్యంలో రావాల్సిన పరిణతి రాలేదని తెలిపారు. ఎన్నికల్లో ఓటు వేసే సమయంలో అభ్యర్థి గుణగణాలు, మంచిచెడ్డలు చూడాలని, అంతకుమించి పార్టీల వైఖరిని పరిశీలించాలని సూచించారు. 'నవంబర్ 30 నాడు ఓట్లు పడుతయి. 3 నాడు లెక్కిస్తరు. అంతటితో మన పని అయిపోతుంది అనుకోవద్దు. అక్కడి నుంచే అసలు కథ మొదలవుతుంది. ఆ వ్యక్తి గెలిస్తే ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పడుతుంది? వాళ్ల నడవడిక ఏంది? వాళ్లు అధికారం ఇస్తే ఏం చేశారు? వాళ్ల చరిత్ర ఏంది? అని చర్చించాలి. అప్పుడే ప్రజలు గెలుస్తారు' పేర్కొన్నారు. ఇష్టం వచ్చినట్టు అబద్ధాలు చెప్పి, అభాండాలు వేసి, పనికిమాలిన వాగ్దానాలిచ్చి, చెయ్యలేమని తెలిసి కూడా ఆశలు పెట్టి, చివరికి గెలిచిన తర్వాత మాట మార్చి గోల్‌మాల్ చేసే పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసమని, ప్రజల హక్కులు కాపాడటం కోసమని చెప్పారు.

> 'నవంబర్ 30 నాడు ఓట్లు పడుతయి. 3 నాడు లెక్కిస్తరు. అంతటితో మన పని అయిపోతుంది అనుకోవద్దు. అక్కడి నుంచే అసలు కథ మొదలవుతుంది. ఆ వ్యక్తి గెలిస్తే ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పడుతుంది? వాళ్ల నడవడిక ఏంది? వాళ్లు అధికారం ఇస్తే ఏం చేశారు? వాళ్ల చరిత్ర ఏంది? అని చర్చించాలి. అప్పుడే ప్రజలు గెలుస్తారు.
>
> - సీఎం కేసీఆర్

### కాంగ్రెస్ ఏం చేసిందో గుర్తు తెచ్చుకోవాలి

కాంగ్రెస్ పార్టీ 50 ఏండ్లు ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించి ఏం చేసిందో గుర్తు తెచ్చుకోవాలని ప్రజలను సీఎం కేసీఆర్ కోరారు. '1956 దాకా మనది మనకే ఉన్న తెలంగాణను ఊడగొట్టినోడు ఎవడు? ఆంధ్రాతో కలపవద్దని నెత్తినోరు మొత్తుకుంటున్నా వినకుండా, సిటీ కాలేజీ దగ్గర ఉద్యమం చేస్తుంటే ఏడుగురు విద్యార్థులను కర్కషంగా కాల్చి చంపి, తెలంగాణను తీసుకుపోయి ఆంధ్రాలో కలిపింది ఎవడు? గుర్తుకు తెచ్చుకోవాలి. ఆ ఒక్క దెబ్బతో తెలంగాణ ప్రజలు 58 ఏండ్లు గొడగొడ ఏడ్చారు. మళ్లీ తెలంగాణ వచ్చిననాడు మంచినీళ్లు లేవు, సాగునీళ్లు లేవు, వలసలు, చేనేతల ఆత్మహత్యలు, రైతుల ఆత్మహత్యలు.. ఇట్లా అన్నీ సమస్యలే. ఇవన్నీ మన నెత్తిన పెట్టిన పార్టీ కాంగ్రెస్ కాదా?' అని ప్రశ్నించారు. దళితులు తరతరాల నుంచి అణచివేతకు గురయ్యారని, వాళ్లు మనుషులు కాదా? వాళ్ల ఓట్లు కావాలి తప్ప వాళ్లు బాగుపడొద్దా? అని నిలదీశారు. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ తెలంగాణకు ఏ ఒక్కటైనా సరిగా చేసిందా? ప్రాజెక్టులు కట్టారా? నీళ్లు ఇచ్చారా? కరెంటు ఇచ్చారా? ఉద్యోగాలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. అందుకే నిజాయితీతో ఆలోచించి, స్థిరంగా నిర్ణయం తీసుకొని ఓటేయాలని సూచించారు.



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును చూసేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు

### ఎమ్మెల్యేలను కొనడానికి వచ్చి పట్టుబడ్డోడే నాపై పోటీ అట..

తెలంగాణ దశాబ్దాల అవస్థకు కాంగ్రెస్ పార్టీనే కారణమని సీఎం కేసీఆర్ విమర్శించారు. 'తెలంగాణ ఉద్యమంలో కూడా ఇట్లనే నన్ను అర్వతిప్పలు పెట్టినరు. చివరికి నాకు తిక్కరేగి కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అని బయలుదేరిన. అప్పుడు ఊర్లన్నీ ఉద్యమాలై సకల జనుల సమ్మె జరిపినరు. ఇగ తట్టుకోలేక దిగొచ్చి తెలంగాణ ప్రకటన చేసినరు. అప్పటికైనా ఇచ్చినరా! వెంటనే ఇవ్వలే? మళ్లో ఏడాదిన్నర దాకా ఎగబెట్టినరు. మళ్లీ యావన్మంది ఉద్యోగులు, రైతులు, ప్రజలు రోడ్డు మీదకు వచ్చి కొట్లాడితే.. చివరికి నూకలు మిగలకుండా అయితమని భయపడి తెలంగాణ ఇచ్చినరు. అదీ కాంగ్రెస్ పరిస్థితి. వచ్చిన తెలంగాణను కూడా బతకనియ్యొద్దని, రాజకీయ అస్థిరత తేవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనే ప్రయత్నం చేసినరు. అప్పుడు ఎవడైతే ఎమ్మెల్యేలను కొనడానికి వచ్చి రూ.50 లక్షలతో పట్టుబడ్డడో.. ఇప్పుడు ఆ మహాత్ముడే కామారెడ్డిలో నాపై పోటీకి వస్తడట. మరి.. ఎవరికి ఏం బుద్ధి చెప్పాల్నో మీరే నిర్ణయించండి' అని కేసీఆర్ కోరారు.

### కాంగ్రెస్‌నే బంగాళాఖాతంలో వెయ్యండి

ధరణితో దళారీ వ్యవస్థకు చెక్ పడిందని, ఆఫీసుల చుట్టూ తిరిగే గోస తీరిందని, లంచాలు ఇచ్చే పీడ వదిలిందని సీఎం కేసీఆర్ తెలిపారు. ఇప్పుడు ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని కాంగ్రెస్ నాయకులు అంటున్నారని, అందుకే.. కాంగ్రెస్ పార్టీనే బంగాళాఖాతంలో వెయ్యాలని సూచించారు. రైతు చచ్చిపోతే బీమా డబ్బులు, ధాన్యం పైసలు కూడా నేరుగా అకౌంట్‌లో పడుతున్నాయని తెలిపారు. ఇప్పుడు ధరణిని తీసేస్తే.. రైతుబంధు ఎట్లొస్తది? రైతుబీమా ఎట్లొస్తది? ధాన్యం పైసలు ఎట్లొస్తయి? అని కేసీఆర్ ప్రశ్నించారు.

> ప్రధాని మోదీ సొంత రాష్ట్రంలో, సొంత నియోజకవర్గంలో కూడా వ్యవసాయానికి 24 గంటల కరెంటు లేదు. మరి మన దగ్గర ఎట్లా ఇస్తున్నం? తెలంగాణ వ్యవసాయం బోర్ల మీద ఆధారపడ్డది కాబట్టి, ఆరునూరైనా సరే 24 గంటలు ఇవ్వాలని నిర్ణయించినం. పట్టుబట్టి సాధించినం.
>
> - సీఎం కేసీఆర్

### బీజేపీ నాయకులను నిలదీయండి

రైతుల బాయిలకాడ మోటర్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని మోదీ ఒత్తిడి తెచ్చినా 'నేను సచ్చినా పెట్ట' అని స్పష్టంగా చెప్పానని సీఎం కేసీఆర్ తెలిపారు. దీంతో ఏటా రూ.5 వేల కోట్ల చొప్పున రాష్ట్రానికి రావాల్సిన రూ.25 వేల కోట్లను ఆపేశారని చెప్పారు. 'బీజేపోడు ఏ మొఖం పెట్టుకొని కామారెడ్డిలో ఓట్లు అడుగుతడు? బీజేపీ నాయకులు ఓట్ల కోసం వస్తే నిలదీసి అడగండి. వాళ్లకు సరైన పద్ధతిలో బుద్ధి చెప్పాలె' అని ప్రజలను కోరారు. 'దేశంలో ప్రతి జిల్లాకు ఒక నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని చట్టం ఉన్నది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఒక్కొక్కటి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి నేను అనేకసార్లు లేఖలు రాశాను. బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో డిమాండ్ చేశారు. అయినా ఒక్కటంటే ఒక్కటి కూడా ఇవ్వలేదు. ఒక్క నవోదయ పాఠశాల కూడా ఇవ్వని బీజేపీకి ఒక్క ఓటైనా ఎందుకు వేయాలె?' అని నిలదీశారు. దేశవ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిన బీజేపీ ప్రభుత్వం, తెలంగాణపై పగబట్టి ఒక్కటి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు.

> దేశంలో ప్రతి జిల్లాకు ఒక నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని చట్టం ఉన్నది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఒక్కొక్కటి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి నేను అనేకసార్లు లేఖలు రాశాను. బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో డిమాండ్ చేశారు. అయినా ఒక్కటంటే ఒక్కటి కూడా ఇవ్వలేదు. ఒక్క నవోదయ పాఠశాల కూడా ఇవ్వని బీజేపీకి ఒక్క ఓటైనా ఎందుకు వేయాలె?
>
> - సీఎం కేసీఆర్

> 2014 తర్వాత కొత్తగా చేరిన కార్మికులు లక్ష మంది దాకా ఉంటారు. ప్రభుత్వం ఏర్పడగానే వారందరికీ పెన్షన్ మంజూరు చేస్తాం.
>
> - సీఎం కేసీఆర్

### రైతు ముఖం ఇప్పుడే తెల్లబడ్డది..

దశాబ్దాలుగా రైతున్నలు అరిగోస పడ్డరని, తెలంగాణ వచ్చినంక ఇప్పుడే కాస్త ముఖాలు తెల్లబడ్డాయని సీఎం కేసీఆర్ తెలిపారు. ఇప్పుడు మళ్లీ.. రైతుబంధు వద్దు, కరెంట్ 24 గంటలు వద్దు, ధరణిని తీసేస్తామని అంటున్న కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమైతమని హెచ్చరించారు. గతంలో కరెంటోళ్లు పొలాల దగ్గరికి వచ్చి నానా యాగీ చేసేటోళ్లని, ఇవాళ ఆ పరిస్థితి రాష్ట్రంలో ఎక్కడైనా ఉన్నదా? అని ఆలోచించాలని కోరారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్లు పటాకులు పేలినట్టు పేలేవని, కానీ.. ఇవాళ ట్రాన్స్‌ఫార్మర్ కాలుతున్నదా? మోటార్లు కాలుతున్నయా? అని ప్రశ్నించారు. రైతుల దగ్గర ధాన్యం కొంటే ప్రభుత్వానికి ఏటా రూ.500 నుంచి రూ.1000 కోట్ల నష్టం వస్తదని, అయినా మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వమే కొంటున్నదని చెప్పారు. రైతాంగాన్ని నిలబెట్టుకోవాలని, వ్యవసాయాన్ని స్థిరీకరించాలనే తపనతో బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. పదేండ్లుగా రాష్ట్రంలో ప్రశాంతంగా ఉన్నదని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి కులం, మతం, జాతి అనే బేధాలు లేవని స్పష్టంచేశారు. 'పదేండ్ల నుంచి వానలు మంచిగ పడుతున్నాయి. కరువు లేదు. సంక్షేమ పథకాలు అద్భుతంగా కొనసాగుతున్నాయి. దేశంలో ఎక్కడా లేనంత పింఛన్ ఇస్తున్నాం. గొర్రెలు, చేపపిల్లల పంపిణీ.. ఇలా అన్ని వృత్తులవారిని మంచిగ చూసుకుంటున్నాం. మిషన్ కాకతీయతో చెరువులు కళకళలాడుతున్నాయి. ఏటా రూ.33 వేలకోట్ల చేపలను తెలంగాణ ఎగుమతి చేస్తున్నది. కంటివెలుగు అనే పేరు ఎప్పుడైనా విన్నరా? చరిత్రలో ఏ ప్రభుత్వమన్నా చేసిందా?' అని ప్రశ్నించారు.

### నిజమైన రైతురాజ్యం అయితది

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ వెళ్తున్నామని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. మొదట విద్యుత్తు సమస్యపై దృష్టిపెట్టి ఆరు నెలల్లోనే పరిష్కరించామని తెలిపారు. ఇప్పుడు దేశంలో అన్ని రంగాలకు 24 గంటల కరెంటు ఇచ్చే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. ఒకనాడు గోసపడ్డ చోటే ఇప్పుడు 24 గంటల కరెంటు వెలుగు జిలుగులు ఉంటున్నాయని పేర్కొన్నారు. 'ప్రధాని మోదీ సొంత రాష్ట్రంలో, సొంత నియోజకవర్గంలో కూడా వ్యవసాయానికి 24 గంటల కరెంటు లేదు. మరి మన దగ్గర ఎట్లా ఇస్తున్నం? తెలంగాణ వ్యవసాయం బోర్ల మీద ఆధారపడ్డది కాబట్టి, ఆరునూరైనా సరే 24 గంటలు ఇవ్వాలని నిర్ణయించినం. పట్టుబట్టి సాధించినం. కానీ 24 గంటల కరెంటు వద్దని, 3 గంటలు ఇస్తే సరిపోతుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రైతుబంధు దుబారా అని మాజీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటున్నారు. రైతుబంధు, 24 గంటల కరెంటు ఉండాలంటే బీఆర్ఎస్ గవర్నమెంట్ మరోసారి రావాలి. అప్పుడు రైతుబంధు రూ.10 వేల నుంచి రూ.16 వేలకు పెరుగుతుంది. నిజమైన రైతు రాజ్యం అవుతుంది' అని సీఎం పేర్కొన్నారు.

### లక్ష మంది కొత్త బీడీ కార్మికులకు పెన్షన్

రాష్ట్రంలో లక్షమంది బీడీ కార్మికులకు పెన్షన్ ఇస్తున్నామని సీఎం కేసీఆర్ తెలిపారు. 'నేను దుబ్బాకలో చదువుతున్నప్పుడు పక్కనే పద్మశాలీల కుటుంబం ఉండేది. వాళ్లు చేనేత పనితోపాటు బీడీలు చుట్టేవాళ్లు. అయినా వారి పొట్ట కూటికి సరిపోయేది కాదు. వాళ్ల పరిస్థితి తెలుసుకాబట్టే బీడీ కార్మికులకు పెన్షన్ ఇస్తున్నాం. 16 రాష్ట్రాల్లో బీడీ కార్మికులున్నారు. తెలంగాణలో తప్ప ఎక్కడా పెన్షన్ ఇవ్వడం లేదు. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి కూడా పెన్షన్ రూ.5 వేలకు పెరుగుతుంది. పెన్షన్‌కు 2014 కటాఫ్ పెట్టడం వల్ల ఆ తర్వాత ఈ పరిశ్రమలో చేరిన వారికి పెన్షన్ రావడం లేదని మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, కేటీఆర్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నా దృష్టికి తెచ్చారు. దీంతో మానవీయ కోణంలో ఆలోచించి ప్రతి బీడీ కార్మికురాలికి పెన్షన్ ఇస్తున్నాం. 2014 తర్వాత కొత్తగా చేరిన కార్మికులు లక్ష మంది దాకా ఉంటారు. ప్రభుత్వం ఏర్పడగానే వారందరికీ పెన్షన్ మంజూరు చేస్తాం' అని ప్రకటించారు.

### నేను బతికున్నంతవరకు సెక్యులర్ రాష్ట్రంగానే..

ప్రసంగంలో భాగంగా ముస్లింలను ఉద్దేశించి సీఎం కేసీఆర్ హిందీలో ప్రసంగించారు. 'కామారెడ్డిలోని ముస్లిండందరికీ సలాం చేస్తున్నా. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కొట్లాడుతున్న సమయంలో అనేకసార్లు కామారెడ్డిలో సభలు నిర్వహించాను. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం మనం చేస్తున్న పోరాటంలో నిజాయితీ ఉన్నది, ధర్మం ఉన్నది కాబట్టి ఈ పోరాటంలో తప్పక విజయం సాధిస్తాం అని ఆశీర్వదించారు' అని గుర్తు చేసుకున్నారు. 'అల్లా కే ఘర్ మే ధేర్ హో సక్తా, లేకిన్.. అంధేర్ నహీ' అని పేర్కొన్నారు. 'తెలంగాణ ఏర్పాటుకు ముందు ఉమ్మడి రాష్ట్రంలో మైనార్టీల అభివృద్ధి కోసం రూ.900 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, తాము ఈ పదేండ్లలోనే రూ.12 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. తాను బతికున్నంత వరకు తెలంగాణ సెక్యులర్‌గా ఉంటుందని స్పష్టంచేశారు. మైనార్టీలంతా బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలని, కారు గుర్తుకే ఓటేయాలని కోరారు.



కామారెడ్డిలో జన ప్రభంజనం... కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం బీఆర్ఎస్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు పోటెత్తిన అశేష జనవాహిని